ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు

జిల్లా వార్తలు

మంగళవారం 27 ఫిబ్రవరి 2024





సీఎం జగన్ మాట్లాడుతుండగానే ఒకవైపు ఖాళీ అవుతున్న కుర్చీలు - మరోవైపు సభ నుంచి బయటకు వచ్చి ముళ్లచెట్ల మధ్యలో దూరి వెళ్లిపోతున్న జనం

హాజరుకాని ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు

చిత్తూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లను పొందలేకపోయిన ముగ్గురు ఎమ్మెల్యేలు సోమవారం నాటి శాంతిపురం సీఎం జగన్ సభలో కనిపించలేదు. చిత్తూరు, పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఆదిమూలంను కాదని సీఎం జగన్ ఆమధ్య విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, రాజేష్‌ను కొత్త ఇన్‌చార్జులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎమ్మెల్యేలు అన్నిరకాల ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎలాంటి ప్రొటోకాల్ లేకుండానే కొత్త ఇన్‌చార్జులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అధికారులు కూడా వారికి స్వాగతం పలికి వారి సేవలో నిమగ్నమవుతున్నారు. శాంతిపురంలో సోమవారం జరిగిన సీఎం సభా వేదికమీద చిత్తూరు, పూతలపట్టు కొత్త ఇన్‌చార్జులు హడావిడి చేశారు. ఎమ్మెల్యేల తరహాలో వారికి మొదటి వరుసలో స్థానం దక్కింది.

ఎంత కష్టం..

- జగనన్నా మాకిదేం బాధన్నా
- సీఎం కార్యక్రమాల్లో జనం ఆపసోపాలు
- ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు
- లాఠీఛార్జీలు, సభనుంచి వెళ్లకుండా అడ్డగింతలు

ఎంత నష్టం!



తమను వెళ్లనీయాలంటూ దూసుకొస్తున్న జనాన్ని నిలువరిస్తున్న పోలీసులు



లాఠీలను ఝుళిపిస్తూ అడ్డుకుంటున్న పోలీసులు

కుప్పం/శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 26: సీఎం జగన్ వచ్చారు వెళ్లారు. హంద్రీ-నీవా జలాలు విడుదల చేశారు. అవెంతకాలం కాలువలో ఉంటాయో తెలియదు కానీ జనం మాత్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం నాటి ఆయన పర్యటనకు ఆదివారం నుంచే జనం కష్టాలు ప్రారంభమయ్యాయి. కుప్పం ఆర్టీసీ డిపోలోని బస్సులన్నింటినీ జనం తరలింపుకోసం పలు గ్రామాలకు పంపేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సోమవారం ఉదయం నుంచి సభ జరిగే శాంతిపురం వద్ద ట్రాఫిక్ మళ్లించారు. బడగుమాకుల పల్లె, విజలాపురం, రామకుప్పం మీదుగా వి.కోట వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఈ మధ్యలో జాతీయ రహదారి పొడవునా బారికేడ్లు పెట్టి స్థానికులను ఇబ్బందులకు గురిచేశారు. ఉదయం 8 గంటల నుంచే వివిధ ప్రాంతాలనుంచి ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సుల ద్వారా జనాల తరలింపు ప్రారంభమైంది. సుమారు 3 వేల బస్సులు కేటాయించగా, సగానికి పైగా ఖాళీగా దర్శనమిచ్చాయి.

జనం దిగ్బంధం

ఎమ్మెల్సీ భరత్ ప్రసంగం మొదలు పెట్టగానే సభ నుంచి వెనుదిరగడం మొదలు పెట్టారు. సీఎం జగన్ ప్రసంగం మొదలు పెట్టినప్పుడు కాసేపు ఆలకించడానికి ప్రయత్నించారు. కానీ, అన్నీ నేనే చేశాను, మీ కుప్పాన్ని నేనే అభివృద్ధి చేశాను అంటూ స్వోత్కర్ష ఎక్కువ కావడం.. రాష్ట్రమంతా కామన్‌గా ఇస్తున్న సంక్షేమ పథకాలను కుప్పానికే ప్రత్యేకంగా ఇస్తున్నట్లు వాటి విలువను కోట్లలో లెక్కకట్టి చెప్పడంపైనా జనం నిరాసక్తంగా ఉన్నారు. దీంతో ఒక్కరొక్కరే లేచి బయటకు నడిచారు. 'యాడికి పతా వుండావు అప్పుడే?' అని ఒక మహిళ అంటే, 'అయ్యో, రావే పోదాం, ఇక్కడేముండాది, నామొగం' అని పక్కనున్న మహిళను సభా ప్రాంగణంనుంచి మరో మహిళ ఈడ్చుకుపోవడం కనిపించింది. ఇలా వెళ్తున్న వారి సంఖ్య క్రమేణా పెరగడంతో పోలీసులు రోడ్డుమీద బారికేడ్లు అడ్డుపెట్టి నిలువరించడానికి ప్రయత్నించారు. కాసేపు చూసిన జనం, ఆ తర్వాత వారిని తోసుకుని మరీ బయటకు వెళ్లారు.

లాఠీ ఝుళిపించిన పోలీసులు

సీఎం ప్రసంగం అరగంటలో ముగుస్తుందనగా కుప్పం-పలమనేరు రహదారిలో పోలీసులు బారికేడ్లు పెట్టి రాకపోకల్ని అడ్డుకున్నారు. ఎండ తీవ్రంగా ఉండటంతో కాసేపు చూసిన జనం ఓపిక నశించింది. ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుంటూ ముందుకు రాగా, పోలీసులు అడ్డుకునే క్రమంలో కొందరు కిందపడ్డారు. పోలీసులు లాఠీలను ఝుళిపిస్తూ మిగిలిన వారిని అడ్డుకున్నారు. సీఎం జగన్ హెలిప్యాడ్‌కు వెళ్లాక.. కాన్వాయ్ వాహనాలు వెళ్లడంతో జనాన్ని వదిలారు. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పట్టించుకోకపోవడంతో జనంతో పాటు ద్విచక్ర వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు.

సీఎం సారు వొంగలేరని..

సంప్రదాయం ప్రకారం ఏ కార్యక్రమమైనా కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా పూజ చేసి ప్రారంభించడం ఆనవాయితీ. నేలమీద వొంగొని కొబ్బరికాయ ఒడతారు. కానీ హంద్రీ-నీవా కాలువ వద్ద కొబ్బరికాయ కొట్టేందుకు ప్రత్యేకంగా ఒక దిమ్మెను ఏర్పాటు చేశారు. సీఎం సార్ వొంగలేరని ఈ ఏర్పాటు చేసినట్టుందని జనం చమత్కరించారు.

ఈ భూమిని ఏమి చేస్తారో?

సీఎం సభా స్థలం ఏకంగా ఏడెనిమిది ఎకరాలుంటుంది. ఇందులో బసవేశ్వరస్వామి దేవస్థానం, డీకేటీ భూములు కూడా కలిసి ఉన్నాయి. 'సీఎం సభ పేరు చెప్పి చదును చేశారు. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ అధికార పార్టీవోళ్లు ఆకిరికి ఈ భూములను ఏమి చేయబోతారో' అని జనం వారిలోవారు చర్చించుకున్నారు. ఇంతకుముందునుంచే ఈ భూములపై వివాదం నడుస్తుండడం, అందులో కొందరు అధికార పార్టీ హస్తముండడం దీనికి కారణం. కాగా, విద్యుత్తు కోతలతో తాము అల్లాడుతుంటే, ఒక గంట సీఎం సభకోసం లక్షలు ఖర్చు చేసి తాత్కాలికంగా ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేయడమేమిటని జనం మాట్లాడుకున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం

హంద్రీ నీవా జలాల విడుదల

కుప్పం నియోజకవర్గానికి హంద్రీ నీవా నీటిని సోమవారం ఉదయం రాజుపేట వద్ద సీఎం జగన్ లాంఛనంగా విడుదల చేశారు. కాలువ గట్టుపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, అంబటిరాంబాబు, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, కలెక్టరు షన్మోహన్ తదితరులతో కలిసి ప్రారంభోత్సవ శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పసుపు, కుంకుమ, పుష్పాలు సమర్పించి జలహారతి ఇచ్చారు. బటన్ నొక్కి జలాలను విడుదల చేశారు. అక్కడ్నుంచి హెలికాప్టరులో సమీపంలోని సభాస్థలికి వెళ్లారు. ఇక, హంద్రీ-నీవా కాలువ వద్దకు తరలించిన జనానికి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో సుమారు గంటన్నర సేపు ఎండలో ఇబ్బంది పడ్డారు.




కర్ణాటక మద్యం షాపు వద్ద మందుబాబులు - సభకు సమీపంలోనే మద్యం తాగుతూ..

బారులు తీరిన మందుబాబులు

సీఎం ప్రారంభించిన కాలువలో నీళ్లు ఉన్నాయో లేవో కానీ, ఆ ప్రాంతంలో మాత్రం మద్యం ఏరులై పారింది. ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో ఉన్న రాజుపేట రోడ్డులోని నాలుగైదు మద్యం దుకాణాలు మందుబాబులతో కిటకిటలాడాయి. ఒక వైపు సీఎం సభ జరుగుతుండగా, మరో వైపు వీరిపని వీరు చేస్తూ పోయారు.

సభ బయట ఫొటోలు తీయరాదు

- మీడియాకు అధికారుల ఆంక్షలు
- బయటకు వెళ్తున్న జనం ఫొటో తీసిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దాడికి యత్నం



ముళ్లపొదల్లో నుంచి బయటకు వెళ్లిపోతున్న జనం

కుప్పం: అధికారంలో ఉన్నా అభద్రతలో వైసీపీ నేతలు కూరుకుపోయి ఉన్నారని సోమవారం నాటి సీఎం సభ కవరేజీలో మీడియాపై ఆంక్షలు, అడుగడుగునా నిఘా పెట్టిన తీరు వెల్లడిస్తోంది. ఐ అండ్ పీఆర్ ఆదివారమే ఆంక్షలతో కూడిన ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాల మేరకు పబ్లిక్ మీటింగ్ మినహా, అన్ని ప్రాంతాల్లోను ఫొటోలు, వీడియో కవరేజీకి ఐ అండ్ పీఆర్ శాఖకు మాత్రమే అనుమతి ఉంది. కావున లైవ్ స్ట్రీమింగ్‌కు సంబంధించి ఫ్రీక్వెన్సీలు, ఫొటోలు, ప్రెస్ నోట్లు ఈ గ్రూపులోనే షేర్ చేయడం జరుగుతుంది. దయచేసి పాత్రికేయులు సహకరించగలరు' అని పేర్కొంది. అంటే సీఎం సభ లోపల తప్ప, బయట ఎక్కడా, రోడ్లు, పార్కింగ్ స్థలాలు ఇతర పబ్లిక్ స్థలాలలో ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి లేదన్నమాట. ఎక్కడ ఎవరు మొబైల్‌లో ఫొటోలు తీస్తున్నా వైసీపీ కార్యకర్తలు అనుమానంగా నిలదీయడం కనిపించింది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో సభనుంచి వెళ్లిపోతున్న జనాన్ని ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి చిత్తూరు ఫొటోగ్రాపర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడికి యత్నించాయి. అతడు పోలీసుల వద్దకు చేరుకోగా.. వారి సమక్షంలోనే కెమెరాను లాక్కుని ఫొటోలను డిలీట్ చేశారు. ఏ నిజాలు జనంలోకి వెళ్లిపోతాయో అనే భయం సభ నిర్వాహకుల్లో కనిపించింది. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ శ్రేణుల ఘటనపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ఈ ఘటన బాధాకరమని చిత్తూరు ప్రెస్‌క్లబ్, ఏపీడబ్ల్యూజే సోమవారం ఒక ప్రకటనలో ఖండించింది. రాప్తాడు ఘటన మరువకముందే మళ్లీ దాడి ప్రయత్నం అనేది పత్రికా ప్రపంచానికి గొడ్డలిపెట్టు అని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి అన్నారు. మీడియాపై దాడులను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తీవ్రంగా విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

పత్రికలకు పార్టీలు ఉండవు: అమర్

పలమనేరు: 'పత్రికలకు పార్టీలు ఉండవు. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చాక విలేకరులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయి. రాప్తాడులో ఫొటోగ్రాఫరు శ్రీకృష్ణను వైసీపీ గూండాలు దాడిచేసిన ఘటన మరవకముందే కుప్పంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరు శివకుమార్‌పై దాడికి యత్నించడం, కెమెరా తీసుకుని ఫొటోలు డిలీట్ చేయిడడం దారుణం' అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఇకపై మీడియా మిత్రులు కవరేజీకి వెళ్లే సందర్భంగా కత్తులు, కర్రలతో వెళ్లాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. ఈ ఘటననూ అన్ని పక్షాలు.. మీడియాలు ఖండించాల్సిన అవసరముందన్నారు.

హవ్వ.. ఎన్ని అబద్ధాలు!

కుప్పం, ఫిబ్రవరి 26: కుప్పానికి మొత్తం తానే చేశానంటూ సీఎం జగన్ సోమవారం గుండిశెట్టిపల్లె సభలో యథాప్రకారం దబాయించి అబద్ధాలు వల్లించారు. ఒక మారుమూల విసిరేసినట్టుగా ఉండే కుప్పాన్ని తన నియోజకవర్గంగా ఎన్నుకుని సుదీర్ఘకాలంగా నారా చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని చూసిన జనం జగన్ మాటలకు విస్తుపోయారు. జగన్ మాటలనూ, నిజాలనూ ఇక్కడ ఇస్తున్నాం.

జగన్: 'హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తెచ్చింది నేనే'

నిజం: హంద్రీ-నీవా జలాలను తెలుగుదేశం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సుమారు రూ.500 కోట్లు వ్యయం చేసి పలమనేరు నియోజకవర్గం వి.కోట మండలం కృష్ణాపురం దాకా తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి జగన్ నీళ్ల వదిలి ప్రారంభోత్సవం చేసిన ప్రాంతానికి దూరం 20 కిలోమీటర్లు మాత్రమే. ఈ 20కిలోమీటర్లు నీళ్ల తీసుకురావడానికి జగన్‌కు ఐదేళ్ల పట్టింది. సరిగ్గా ఎన్నికలకు ముందు మాత్రమే హడావుడిగా ఈ పని కూడా చేశారు. కొసమెరుపు ఏమిటంటే.. ప్రారంభోత్సవ సమయంలో నీళ్ల కనిపించడం కోసం, కట్టకట్టి నీటిని ఆపి వదిలారు. రాజుపేటలో జగన్ వదిలిన నీళ్ల.. ఆయన ప్రసంగించిన సభ జరిపిన గుండిశెట్టిపల్లె దాకా కూడా చేరుకోలేదు. అయినా నీళ్ల పొలాలను తడిపితే తప్ప జనానికి మేలు చేసినట్టు కాదు.

జగన్: 'కుప్పంను మున్సిపాలిటీ చేసింది నేనే'

నిజం: మున్సిపాలిటీగా మారింది జగన్ ప్రభుత్వంలోనే అయినా అంతకు ముందు జరిగిన కసరత్తు కీలకమైనది. కుప్పంతోపాటు పరిసర ప్రాంతాల్లోని 8 పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, రూర్బన్ పథకం కింద రూ.100 కోట్లను కేంద్ర సాయంతో చంద్రబాబు తీసుకొచ్చారు. మున్సిపాలిటీగా మారితే ఈ నిధులు వెనక్కి వెళ్తాయనే ఉద్దేశ్యంతో, పంచాయతీలను కొనసాగించారు. రూర్బన్ నిధులతో రక్షిత మంచినీటి ట్యాంకులు, రోడ్లు తదితర అభివృద్ధి పనులు చాలా జరిగాయి. మున్సిపాలిటీ అయ్యాక జరిగిన అభివృద్ధి ఏమిటో, తాము కేటాయించామని చెబుతున్న రూ.66 కోట్లతో ఏయే పనులు ఎక్కడెక్కడ చేశారో వైసీపీ నేతలు చెప్పలేకపోతున్నారు.

జగన్: 'కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసింది నేనే'

నిజం: వైసీపీ ప్రభుత్వంలోనే కుప్పం రెవెన్యూ డివిజన్‌గా మారింది. అయితే ఇందువల్ల జనానికి జరిగిన మేలు ఏమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కుప్పానికి 8 కిలోమీటర్ల దూరంలో చంద్రబాబు కట్టించిన న్యాక్ భవనంలోని ఓ గదిలో ఆర్డీవో కార్యాలయం మొక్కుబడిగా కొనసాగుతోంది. కనీసం ఆర్డీవో పేరు కూడా నియోజకవర్గంలో సగం మందికి తెలీదు.

జగన్: 'పోలీసు సబ్ డివిజన్ చేసింది నేనే'

నిజం: ప్రకటించి ఏళ్ల గడిచినా, డీఎస్పీని నియమించింది మాత్రం ఇటీవలే. నియోజకవర్గంలో ఉన్నది నాలుగు మండలాలు. ఇద్దరు సీఐలు ఉన్నారు. ఇప్పుడు కొత్తగా ఎన్నికలకు ముందు డీఎస్పీ వచ్చారు. అంతే తేడా.

జగన్‌వి డబ్బామాటలు



పలమనేరు: హంద్రీనీవాపై సీఎం జగన్ అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి సోమవారం దుయ్యబట్టారు. ఒకవైపు పోలవరం పనులు కోల్డు స్టోరేజీలో పెట్టి మరోవైపు హంద్రీ నీవా ద్వారా నీటిని తాను కుప్పానికి తెచ్చానని చెప్పడం నమ్మేదానికేనా జగన్? అని ప్రశ్నించారు. గతంలో సీఎం చంద్రబాబు చొరవతో కుప్పం నియోజకవర్గంలోని ఆదినేపల్లి వరకు 630 కిలో మీటర్లు దూరం హంద్రీనీవా నీటిని తీసుకొచ్చామని గుర్తుచేశారు. తాను గతంలో పలమనేరు నియోజకవర్గం నుంచి కుప్పం బ్రాంచి కెనాల్‌కు నీటిని విడుదల చేశానని, కేవలం 30 కిలోమీటర్లు కాలువ పనులు చేసి తామే పూర్తి చేశామని చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. నిజానికి చంద్రబాబు పాలనలోనే పులివెందులకు నీటిని అందించిన విషయాన్ని జగన్ గుర్తు తెచ్చుకోవాలన్నారు. నాలుగున్నరేళ్ల కాలయాపన చేసి ఎన్నికల వేళ తామేదో హంద్రీనీవా జలాలు కుప్పం తెచ్చామని డబ్బామాటలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. మద్య నిషేధంపై వాగ్దానాన్ని నిలబెట్టుకొని ప్రజలను ఓట్లు అడగాలని జగన్‌కు అమర్ సూచించారు.

అభివృద్ధి మాది.. ప్రచారం మీదా?: కంచర్ల

కుప్పం: కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది, హంద్రీ-నీవా పనులు 87 శాతం పూర్తి చేసింది చంద్రబాబు అయితే, ప్రచారం మాత్రం జగన్ చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సోమవారం మీడియా సమావేశంలో విమర్శించారు. మిగిలిన 13 శాతం పనులు కూడా అరాకొరగా చేసి నీళ్ల విడుదల చేసినట్లు ఎన్నికల నోటిఫికేషన్ ముందు చేసే గిమ్మిక్కులను ప్రజలు నమ్మరన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కనమనాయనపల్లె వద్ద కాలువలో కట్టకట్టి నిల్వ ఉంచిన నీటిని సోమవారం ఉదయం వదిలారిలా..

కాసేపటికే 'లిఫ్టు' చేయలేక..!

- ఆదినేపల్లె వద్ద ఆగిన పంపింగ్
- కాలువలో తగ్గిన ప్రవాహం

వి.కోట, ఫిబ్రవరి 26: రామకుప్పం మండలం రాజుపేట వద్ద సోమవారం ఉదయం సీఎం జగన్ హంద్రీ నీవా నీటిని విడుదల చేశారు. కాసేపటికే వి.కోట మండలం ఆదినేపల్లె పంపు హౌస్ వద్ద నీళ్ల డెడ్ స్టోరేజీకి చేరాయి. దీంతో పంపింగ్ ఆగింది. సీఎం విడుదల చేసిన నీటి ప్రవాహమూ తగ్గింది. తొలిరోజే ఇలాగుంటే ఆ వదిలిన నీళ్ల చెరువులకు చేరి.. తమ పొలాలను తడుపుతాయా అని రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కేవలం ఎన్నికల ముందు కుప్పానికి మేమూ నీళ్లిచ్చామని చెప్పుకోవడానికే ఇలా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పుంగనూరు నుంచి సుమారు 70 కిలోమీటర్లు ప్రవహించి మూడు లిఫ్టుల ద్వారా రాజుపేట వరకు అతికష్టంపై నీటిని చేర్చారు. సీఎం వచ్చేప్పటికి నీరు ఉధృతంగా ప్రవహించేందుకు కనమనాయనపల్లె వద్ద కాలువలో కట్ట కట్టి నిల్వ ఉంచిన నీటిని సోమవారం ఉదయం వదిలారు. దీని వల్ల సీఎం విడుదల చేసేటప్పుడు నీళ్ల బాగా కనిపించాయి. దీనికోసం రెండు నెలలుగా తాము ప్రయాసపడుతున్నామని అధికారులు చెబుతుండటం గమనార్హం.



ఆదినేపల్లి వద్ద కాలువలో డెడ్ స్టోరేజీకి చేరిన నీరు

నేటి నుంచి టెట్

- హాజరుకానున్న 6768 మంది అభ్యర్థులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 26: జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని నాలుగు సెంటర్లు, చెన్నైలోని రెండు సెంటర్లలో మార్చి 6వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 6768 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను విద్యా శాఖ అధికారులు పూర్తిచేశారు.

నిజం నిగ్గు తేల్చాలి

- మూడో వారంలో కుప్పానికి చంద్రబాబు, పవన్

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 26: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మార్చి నెల మూడో వారంలో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హంద్రీ నీవా నీటి విషయంలో 'నిజం నిగ్గుతేల్చాలి' పేరిట వాస్తవాలను ప్రజలకు వివరిస్తారు.

6న లోకేశ్ కుప్పం రాక

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మార్చి నెల 6వ తేదీన కుప్పంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు సోమవారం తెలిపారు. కార్యకర్తలు, నాయకులతో మాత్రమే సమావేశమై నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించి, దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



గుట్టపాళ్యం, గూబలవారిపల్లె సమీపంలో పొలాల్లో ఏనుగుల పాదముద్రలు, ధ్వంసమైన వరి

పాకాల, ఫిబ్రవరి 26: పాకాల, ఐరాల మండలాల సరిహద్దులో మొరవపల్లె, కాకర్లవారిపల్లె, గుట్టపాళ్యం, గూబలవారిపల్లె, వేదగిరివారిపల్లె సమీపంలోని పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. గూబలవారిపల్లెకు చెందిన సేతురాం, వేదగిరివారిపల్లెకు చెందిన శివాజి, గుట్టపాళ్యంకు చెందిన విజయ నాయుడులకు చెందిన వరి పొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. గుట్టపాళ్యం విజయ నాయుడు వరి పొలంవద్ద నున్న బావిలో ఓ గున్న ఏనుగు పడిపోగా.. దానిని రక్షించి పెద్ద ఏనుగులు తీసుకెళ్లిపోయిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రదేశమంతా ఏనుగులు తొక్కేయడంతో వరి పంట ధ్వంసమైంది. పంట పొలాలపై కొన్ని నెలలుగా వరుస దాడులతో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నా.. సంబంధిత అటవీ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏనుగుల బెడద తప్పించాలని రైతులు కోరుతున్నారు.

‘పద్మావతి’ ఆస్పత్రిలో 1 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు

- తిరుమలలోని క్యాంటీన్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం
- తిరుపతిలో రూ.7.51కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం
- టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో మార్చి ఒకటినుంచి ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నగదు రహిత వైద్య సేవలు అందిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, మానసిక వ్యాధులు, పీడియాట్రిక్ వంటి ప్రత్యేక విభాగాలతోపాటు జ్వరాలు, వాంతులు, విరేచనాలు వంటి సాధారణ వ్యాధులకూ వైద్యసేవలు అందిస్తారన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులతో కలిసి బోర్డు నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. టీటీడీలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సొసైటీల్లోని సిబ్బందికి, వర్క్ కాంట్రాక్ట్ పరిధిలోని ఎఫ్ఎంఎస్, పారిశుధ్య సిబ్బందికి తిరుమలలోని ఉద్యోగుల క్యాంటీన్‌లో రాయితీపై అల్పాహారం, భోజన సదుపాయం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఉద్యోగుల క్యాంటీన్‌లో వంటశాల, భోజనశాల విస్తరణకు రూ.8.15 కోట్లు, అవసరమైన వంట సామగ్రి కొనుగోలుకు రూ.3కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. అన్నప్రసాద విభాగంలో సూపర్‌వైజరీ పోస్టుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు నిర్ణయించామని, అలాగే కిందిస్థాయి పోస్టులను కార్పొరేషన్ లేదా ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకానికి ఆమోదం తెలిపామని చెప్పారు.

తిరుమలలో దాదాపు 30 ఏళ్ల క్రితం గడువుచెల్లిన హాకర్ లైసెన్సు రెన్యువల్స్, దుకాణాల స్థల మార్పిడి అంశాలను

హాకర్ లైసెన్సు రెన్యువల్స్‌పై..?

కూడా బోర్డు అజెండాలో పొందుపరిచినట్టు తెలిసింది. అయితే వీటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారనే విషయం బయటకు వెల్లడి కాలేదు.

మరికొన్ని నిర్ణయాలిలా..

- టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి పుట్టినరోజును ప్రతి ఏడాది ఫిబ్రవరి 24వ తేదీన నిర్వహించాలని నిర్ణయం. టీటీడీ క్యాలెండరులోనూ ఈ రోజును చేర్చాలని తీర్మానం.
- టీటీడీ అటవీ విభాగంలో విధులు నిర్వహిస్తూ శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్‌లో ఉన్న ఉద్యోగులను తిరిగి వారి సొసైటీలకు బదిలీ చేసి, వేతనాలు పెంచి, బస్సు పాసులు ఇచ్చేందుకు ఆమోదం.
- వడమాలపేట పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లస్థలాల లేఔట్, ఇతర అభివృద్ధి చార్జీలకు సంబంధించి రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించేందుకు ఆమోదం. ఈమొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు.
- శ్రీలంకలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహణకు నిర్ణయం.
- తిరుమలలోని సప్తగిరి విశ్రాంతి భవనంలో 1, 4వ బ్లాకుల ఆధునికీకరణకు రూ.3.19 కోట్ల మంజూరుకు ఆమోదం.
- పాపవినాశనం, కుమారధార, పసుపుధార, ఇతర ప్రాంతాల్లోని 682 మోటార్ పంపు సెట్ల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు రూ.3.15 కోట్ల మంజూరు.
- తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అతిథి భవనాలు, పీఏసీలో ఎఫ్ఎంఎస్ సేవలు మరో మూడేళ్ల పొడిగింపు.
- తిరుపతిలోని శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు నూతన బంగారు కవచాల తయారీకి ఆమోదం. రూ.15లక్షలతో రెండు తండ్లకు బంగారు మలాం వేసిన కాపర్ రేకులు ఏర్పాటు.
- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గత ఏడాది తరహాలోనే జాతర నిర్వహణకు రూ.50లక్షల మంజూరుకు ఆమోదం.
- టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ పదవీ కాలం మరో మూడేళ్ల పొడిగింపు.
- జమ్మూలో నిర్మించిన శ్రీవారి ఆలయంలో పనిచేసే సిబ్బందికి హెచ్ఆర్ఏ పెంపునకు ఆమోదం.
- తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఇన్‌కమ్ ట్యాక్స్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆమోదం.
- అలిపిరి కాలినడక మార్గంలో గాలిగోపురం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దనున్న ముగ్గుబావుల ఆధునికీకరణకు నిర్ణయం.



టీటీడీ బోర్డు సభ్యులతో సమావేశమైన చైర్మన్ కరుణాకరరెడ్డి

జగన్ సభకు మృతుల పేర్లు



చనిపోయిన గంగాధరం, సిపాయి పేర్లతో జాబితా

పెనుమూరు, ఫిబ్రవరి 26: కుప్పంలో సోమవారం జరిగిన సీఎం జగన్ సభకు ప్రతి మండలం, పంచాయతీ నుంచి జనాలను అధికారులు, నాయకులు తరలించారు. ఇందులో భాగంగా పెనుమూరు మండలం నుంచి ఎనిమిది బస్సులను కేటాయించి ఒక్కో సచివాలయానికి ఒక్కో సచివాలయ అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సభకు వెళ్లే వారి వివరాలను ముందు రోజే సిద్ధం చేసి మండల స్థాయి అధికారులకు అందించారు. ఇందులో పులికల్లు సచివాలయ పరిధిలోని గొడుగుమానుపల్లి దళితవాడలో గంగాధరం, సిపాయి ఎప్పుడో మరణించారు. కుప్పం సభకు వీరి పేర్లను కూడా నమోదు చేశారు. అలాగే టీడీపీ కార్యకర్తల పేర్లను కూడా ఇందులో నమోదు చేయడంతో వారు తమ పేర్లను ఎవరు రాశారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలా.. సభకు జనాలు రాకపోవడంతోనే లేనివారి పేర్లు, టీడీపీ నేతల పేర్లు నమోదు చేసి మమ అనిపించారని విపక్షాలు విమర్శించాయి.

అండర్ రైల్వే బ్రిడ్జి ప్రారంభం



శిలాఫలకం వద్ద బీజేపీ నేతలు

పెనుమూరు: పెనుమూరు క్రాస్‌లో రూ.3 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జిని సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వాసుదేవ నాయుడు, జిల్లా కార్యదర్శి జీకే చౌదరి, పూతలపట్టు మండలాధ్యక్షుడు నరసింహులు నాయుడు, రైల్వే అధికారులు మధుసూదనయ్య, వేణుమాదవ్, ఉదయరామసింగ్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పులి దాడిలో మేక మృతి



మృతి చెందిన మేక

చౌడేపల్లె, ఫిబ్రవరి 26: పులి దాడిలో మేక మృతి చెందిన ఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన ప్రకారం.. కేతనపల్లెకు చెందిన నాగరాజ తన మేకలను గ్రామ సమీపంలో మేపుతున్నారు. ఆ సమయంలో పులి మేకలపై దాడి చేసింది. ఈ దాడిలో ఓ మేక అక్కడిక్కడే మృతి చెందింది. పులి దాడి చేయడం చూడగానే ఆ రైతు భయభ్రాంతులకు గురయ్యారు. నెల రోజుల్లో 4 మేకలు, ఒక పాడి ఆవు కూడా మృతి చెందినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. సమాచారం ఇచ్చినా ఆటవీశాఖ అధికారులు స్పందించ లేదని గ్రామస్థులు తెలిపారు.

పాకాల రైల్వేకాలనీలో దారుణ హత్య

- తలపై బండరాయితో మోది చంపేశారు



పాకాల, ఫిబ్రవరి 26: పాకాల రైల్వే కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ సమీపంలో చింతచెట్ల కింద పాకాల పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తిని తలపై బండరాయితో మోది చంపినట్లు స్థానికులు సోమవారం ఉదయం గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాకాల ఎస్ఐ2 ఇషాక్ బాషా, రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తిగత ఆధారాలేమీ లభ్యం కాలేదన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసూతి ఆస్పత్రిలో పర్సు, సెల్‌ఫోను చోరీ

- ఫిర్యాదు చేసినాపట్టించుకోని పోలీసులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 26: తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు అనంతరం చికిత్స పొందుతున్న మహిళ పర్సు, సెల్‌ఫోను చోరీకి గురయ్యాయి. ఈ విషయమై బాధితులు మూడు రోజుల క్రితం వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాధితుల వివరాల మేరకు.. రొంపిచెర్లకు చెందిన షేక్ అస్మిత కాన్పు కోసం ఈనెల 21న స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చింది. మరుసటి రోజునే కాన్పు కావడంతో ఆస్పత్రిలోనే ఉంటూ చికిత్స పొందుతుంది. 22వ తేదీ రాత్రి వార్డులో నిద్రిస్తున్న క్రమంలో పడక పక్కనే ఉన్న పర్సు, సెల్‌ఫోను కనిపించకపోవడంతో వెంటనే విషయాన్ని ఆస్పత్రిలోని సెక్యూరిటీ సిబ్బందికి దృష్టికి తీసుకువచ్చింది. వారు నిర్లక్ష్యంగా మాట్లాడటంతో బాధితులు 23 తేదీన వెస్ట్ పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపోగా ఇంత చిన్న దానికే ఫిర్యాదు ఏమిటని ఉచిత సలహాలు ఇచ్చారు. ఫోన్‌లో విలువైన సమాచారం ఉందని, పర్సులో రూ.ఐదు వేల వరకు నగదు ఉందని విన్నవించినా పట్టించుకోలేదు. తెలిసిన వారి సాయంతో సోమవారం సాయంత్రం మరోసారి స్టేషనుకు వెళ్లడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కానీ కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వరాహస్వామిని దర్శించుకున్న శశికళ



తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం జయలలిత స్నేహితురాలు శశికళ శ్రీవారి దర్శనార్థం సోమవారం రాత్రి తిరుమలకు వచ్చారు. రచన అతిథి గృహానికి చేరుకున్న ఆమె క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న వరాహస్వామిని దర్శించుకున్నారు. తిరిగి అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

చిత్తూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 26: దేశవ్యాప్తంగా 72 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటిలో చిత్తూరు రైల్వే స్టేషన్ కూడా ఉంది. రూ.13.99 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ మాట్లాడుతూ.. గతంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ తిరుపతి వరకే ఉండేదని, తాను చిత్తూరు ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి రైల్వే మంత్రి బండారు దత్తాత్రేయతో మాట్లాడి చిత్తూరు వరకు రప్పించామన్నారు. గుంతకల్లు సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ రైల్వే స్టేషన్లను ఆధునికీకరణ పనులన్నీ సంవత్సరంలోపు పూర్తి అవుతాయన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు రైళ్లల్లో ప్రయాణాలు బాగా పెరిగాయని, అందుకు తగ్గట్టుగా స్టేషన్లలో సౌకర్యాలు లేవన్నారు. అందుకనే అమృత్ భారత్ పథకం కింద రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు ప్రధాని శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, చిత్తూరు స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, జీఆర్‌పీ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సీపీఐ నాయకుడు చైతన్య తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ నమూనా



బహుమతులు అందుకున్న విద్యార్థులతో బీజేపీ నేతలు, రైల్వే అధికారులు

18మందికే జీతాల పెంపు అన్యాయం

అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి : పీస్‌రేట్ క్షురకుల డిమాండ్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 26: పీస్‌రేట్ క్షురకులకు రూ.20వేలు జీతం పెంచుతూ పాలకమండలిలో తీసుకున్న నిర్ణయం 826మందికి గాను కేవలం 18మందికే వర్తింపజేయడం అన్యాయమని శ్రీవారి కల్యాణకట్ట నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి, ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీవారి కల్యాణకట్ట పీస్‌రేట్ క్షురకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఉదయం టీటీడీ పరిపాలన భవనం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పీస్‌రేట్ క్షురకులపై కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తున్నారన్న కారణంగా కొంతమందిని విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెప్ట్ ఆన్ డ్యూటీ(కేవోడీ) పేరిట పదేపదే క్షురకులను విధుల నుంచి తొలగించే విధానాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు. కోర్టుకు వెళ్లారనే సాకుతో తిరుమల తిరుపతి మధ్య రద్దు చేసిన బస్సు పాసులను పునరుద్ధరించాలని, శాశ్వత ఉద్యోగులతో సమానంగా బ్రహ్మోత్సవ బహుమానం వర్తింపచేయాలని కోరారు. కార్పొరేషన్‌లో చేరమని బలవంతం చేయడం తగదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాల నేతలు సంఘీభావం తెలిపారు.



ధర్నా చేస్తున్న కల్యాణకట్ట క్షురకులు

మాట ఇచ్చి మడమ తిప్పేశారు

- తొలుత చెప్పిన చోటే జగనన్న స్థలాలు ఇవ్వాలి
- సీపీఎం భూ పోరాటం

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 26: జగనన్న ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలను సాధించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మంగళం పరిధిలోని బీటీఆర్ కాలనీ నుంచి లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు భూపోరాట ర్యాలీ చేపట్టారు. గతంలో లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పి న భూమి వద్దకు ర్యాలీ చేరుకోగానే తిరుచానూరు పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భం గా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడతూ నాలుగున్నర సంవత్సరాల క్రితం ప్రస్తుత సర్వే అకాడమీకి కేటాయించిన భూమిలో ఉమ్మడి మంగళం పంచాయతీలో పేదలకు జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సిద్ధం చేస్తున్నామని నాయకులు ప్రగల్భాలు పలికారన్నారు. అనంతరం ఆ భూమిని సర్వే అకాడమీకి కేటాయించారని, దీంతో లబ్ధిదారులందరికీ చిందేపల్లి వద్ద స్థలాలు ఇస్తున్నామని చెప్పారని గుర్తుచేశారు. ఆ మాట చెప్పి కూడా సంవత్సరాలు గడిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావుడిగా స్థలాలు చూపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికంగా ఉన్న పేదలకు స్థానికంగానే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవనోపాధికి కూడా అనువుగా లేని ప్రదేశాల్లో స్థలాలు చూపడం దారుణమైన విషయం అన్నారు. గతంలో ఇచ్చిన హామీని నిలెట్టుకోవాలని ఆ స్థలాల్లోనే లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని అప్పటి వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సీపీఎం నేతలు, లబ్ధిదారులు భూమి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుతో పాటు పలువురిని బలంతంగా అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు మాధవకృష్ణ, శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్ లక్ష్మి, నగర కమిటీ నాయకులు బుజ్జి, రవి, వెంకటేష్‌లపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కొంతమంది లబ్ధిదారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. అయితే వారిని విడిచిపెట్టారు. కాగా లబ్ధిదారులను, సీపీఎం నాయకులను అక్రమ అరెస్టును నిరసిస్తూ సీపీఎం నాయకులు తిరుచానూరు పోలీస్‌స్టేషన్ వద్ద సాయంత్రం ధర్నా చేపట్టారు. సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ ధర్నాలో సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, బీటీఆర్ కాలినీకి చెందిన జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఎం నాయకుల అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. స్థానికంగానే లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.



సీపీఎం నాయకులు, లబ్ధిదారులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

తల్లిదండ్రులు మందలించారని..

- ఇంటి నుంచి వచ్చేసిన విద్యార్థులు
- తిరిగి అప్పగించిన తిరుమల పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రులు మందలించడంతో ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి తిరుమలకు వచ్చారు. వారిని తిరుమల టూటౌన్ పోలీసులు గుర్తించి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ వివరాల మేరకు.. తిరుమలలోని ఏఎన్సీ ప్రాంతంలో సోమవారం ఉదయం అనుమానితంగా తిరుగుతున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తమ పేర్లు నారాయణ, మణి అని, మార్కులు తక్కువ వచ్చాయని తల్లిదండ్రులు తిట్టడంతో నల్గొండ నుంచి తిరుమలకు వచ్చామని వివరించారు. దీంతో పోలీసులు వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.



తిరుమల పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు

ముక్కంటి సేవలో రష్యా భక్తులు



రాహు-కేతు పూజల్లో పాల్గొన్న రష్యన్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26: ముక్కంటి ఆలయాన్ని సోమవారం రష్యా భక్తులు దర్శించుకున్నారు. 15 మంది రష్యా భక్తులు ముందుగా ఆలయంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలను జరిపించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మంత్ర ముగ్ధులయ్యారు. ఆలయంలోని పగడ చెట్టు వద్ద బయట నుంచి శివ నామ స్మరణ చేశారు. స్థానిక భక్తులు విదేశీయులతో సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.

కుప్పం సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, ఫిబ్రవరి 26: కుప్పం నియోజకవర్గంలోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని కుప్పం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ అయిన భరత్ సీఎం జగన్‌ను కోరారు. సీఎం సభలో ఆయన ప్రసంగిస్తూ కుప్పంనుంచి రోజుకు 10 వేలమంది బెంగళూరు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారన్నారు. 2024లో జగన్ సీఎం అయ్యాక వారందరికీ ఇక్కడే ఉపాధి కల్పించాలన్నారు. సెజ్, ఇంజినీరింగ్ కళాశాల, బంగళూరుకు నేషనల్ హైవేలు తెచ్చి ఇక్కడ ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు.

నకిలీ జే బ్రాండ్‌తో ప్రజల నడ్డి విరుస్తున్న జగన్



పుంగనూరు, ఫిబ్రవరి 26: ఎన్నికల ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని హామీఇచ్చి అధికారంలోకి రాగానే మాటతప్పి నకిలీ జే బ్రాండ్‌తో సీఎం జగన్ ప్రజల నడ్డివిరుస్తున్నారని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ సీఎం ప్రజలను మోసం చేస్తూ ఎక్సైజ్ పాలసీని 15 ఏళ్లకు తాకట్టుపెట్టి రూ.30 వేలకోట్లు అప్పులు చేశారని దుయ్యబట్టారు. వైసీపీ అన్నీ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిందని, సీఎం పాలన అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులు, తప్పుడు కేసులు సాగిందని విమర్శించారు. కుప్పానికి హంద్రీనీవా కాల్వ ద్వారా నీటిని తీసుకురావడం కూడా ప్రచార ఆర్భాటమేనన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల్లో నీటిని గ్రావిటీ ద్వారా కాల్వల ద్వారా నీరుతెచ్చారని గుర్తుచేశారు. జగన్ కరకట్టల ద్వారా మోసపు నీటిని తెచ్చారని ఆరోపించారు.

చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

- డాక్టర్ సుబ్రహ్మణ్యం

పుంగనూరు, ఫిబ్రవరి 26: చిత్తూరు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని టీడీపీ పెద్దలను కోరినట్లు పుంగనూరు మండలం పెద్దఅలసాపురానికి చెందిన డాక్టర్ ఏ. సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన పుంగనూరులో విలేకరులతో మాట్లాడుతూ తాను రాష్ట్ర ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నానని వివరించారు.

తాగునీటిలో ఐరన్ మాత్రలు కలపడంతో విద్యార్థికి అస్వస్థత

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 26: తోటి విద్యార్థులు తాగునీటిలో ఐరన్ మాత్రలు కలపడంతో తెలియక ఓ విదార్థి ఆ నీటిని తాగి అస్వస్థతకు గురయ్యాడు. చౌడేపల్లె మండలం పుదిపట్ల పాఠశాలలో పుంగనూరు మండలం చదళ్ల గ్రామానికి చెందిన రఘుపతి కుమారుడు మనోజ్‌కుమార్ 10వ తరగతి చదువుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం తన వద్ద ఉన్న బాటిల్‌లోని తాగునీరు తాగిన వెంటనే అస్వస్థతకు గురయ్యాడు. గుర్తించిన ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. విద్యార్థి తాగిన నీటిలో ఐరన్ మాత్రలు వేసినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు తెలిసింది. ప్రస్తుతం పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



పెద్దపంజాణి, ఫిబ్రవరి 26: కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం గౌరీబిద్‌నూరు తాలూకా హంపసంద్ర సమీపంలోని కుదిరేపాళ్యకు చెందిన తిమ్మయ్య కుమారుడు వెంకటేశప్ప (50) పెద్దపంజాణి మండలం శ్రీరామాపురం సమీపంలోని ఓ మామిడి తోపులో చెట్టుకు వేళాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించి సోమవారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద ఉన్న ఆధారు కార్డు సహాయంతో మృతుడు చెట్టుకు వేళాడుతున్న విధానాన్ని, మృతదేహంపై ఉన్న రక్తపుగాయాలు పరిశీలించి అనుమానాస్పద మృతిగా గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

'అనంత'కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



వి.కోట, ఫిబ్రవరి26: అనంతపురంలో జరిగిన న్యాయ సాధన సభకు వి.కోట మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు తరలివెళ్ళారు. సోమవారం ఉదయం మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో పలు వాహనాల్లో ఈ సభకు బయలుదేరారు. రానున్న ఎన్నికలో తమ అభ్యర్థిగా శివశంకర్‌ను బలపరచి గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ సభ్యుడు ఇనాయతుల్లాఖాన్, నాయకులు నాగరాజ్, గురవరెడ్డి, శివన్న, సుమిత్రమ్మ, శంకర, సద్దాం తదితరులు ఉన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వి.కోట,ఫిబ్రవరి26: రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయాన్నే స్వామి వారికి పలు రకాల అభిషేకాలు జరిపించారు. ఆపై రాత్రికి ఉత్సవ మూర్తులు చిత్రగోపురంపై కొలువు తీరి మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగారు. ఆలయ కమిటీ ధర్మకర్త సీతారామయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

29న ఆవుల పబ్బం వేడుకలు

చౌడేపల్లె, ఫిబ్రవరి26: మండలంలోని 14 గ్రామాల ప్రజలు ఆవుల పబ్బం పశువుల పండగను ఈనెల 29, మార్చి 1న జరుపుకోనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. మండలంలోని నుంజార్లపల్లె, సింగి రిగుంట, నూనెముద్దలపల్లె, పేరావాండ్లపల్లె, పరికిదోన, దొనపల్లె, చిన్నకంపల్లె, మల్లెలవారిపల్లె, దిగువమల్లెలవారిపల్లె, సామిరెడ్డిపల్లె, మడుకూరు, మొరం కిందపల్లె, చౌడగానిపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాలలో గురువారం సాయంత్రం పశువుల ఊరేగింపు, పరికిదొన సమీపంలోని నాగప్ప చెరువు వద్ద చాందిని బండ్ల ఊరేగింపు, చాందిన బండిలో కాటమరాజు ఊరేగింపు, శుక్రవారం దీపాలు, దీవ్వెలు సమర్పణ, తిరునాళ్ల జరగనున్నాయన్నారు.

టీడీపీ ఆర్థిక సాయం



రామకుప్పం, ఫిబ్రవరి 26: రామకుప్పం మండలం కెంచనబల్లకు పంచాయతీ వీరనాగపురానికి చెందిన వెంకటలక్ష్మమ్మ, బందార్లపల్లె పంచాయతీ లింగాపురానికి చెందిన అలీలు ఆదివారం రాత్రి మృతి చెందారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు మునిరెడ్డి, సత్తి, వెంకటరమణ , బద్రీ, గిరి, నాగరాజు, సుబ్రహ్మణ్యం, మోహన్‌బాబు. సలాం, చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబసభ్యులకు రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

నేడు టీడీపీ గ్రామ వికాస సమావేశాలు

రామకుప్పం, ఫిబ్రవరి 26: రామకుప్పం మండలం గౌరివిమాకులపల్లె, మణీంద్రం గ్రామాల్లో మంగళవారం గ్రామ వికాస సమావేశాలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గౌరివిమాకులపల్లెలో, మధ్యాహ్నం 12గంటలకు మణీంద్రంలో ఈ సమావేశాలు జరుగుతాయని వారు తెలిపారు. ఈ సమావేశాలకు ఆయా పంచాయతీల్లోని గ్రామాలతోపాటు, మండల పరిధిలోని నేతలు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

29న పుంగనూరు మున్సిపల్ సమావేశం

పుంగనూరు రూరల్ : ఈనెల 29న పుంగనూరు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సమస్యలు, అభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వైసీపీ ఓటు రాజకీయాలు మానుకోవాలి : బీజేపీ





మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు అయూబ్‌ఖాన్, వి.కోటలో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి26: వైసీపీ ఓటు రాజకీయాలు చేయడం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ సూచించారు. బీజేపీ చేపట్టిన ప్రజాపోరు యాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం పుంగనూరు ఇందిరా సర్కిల్‌లో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వైసీపీ వారు ఓటు రాజకీయాలు చేస్తూ కొన్నివర్గాల ప్రజలను బుజ్జగిస్తూ అధికారం కోసం పని చేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మంచి పరిపాలన, అభివృద్ధి అందించడానికి ప్రజలు భారతీయ జనతా పార్టీని ఒక్కసారి ఆదరించి ఓట్లు వేయాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం పక్కాఇళ్లు, రైతులు, పేదలకు అనేక పథకాలు పెట్టి లబ్ధి కల్పిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం డబ్బు, మద్యం అందించి అరచేతిలో వైకుంఠాన్ని చూపే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరముందన్నారు. డబ్బు, మద్యానికి అమ్ముడుపోవడం వల్ల రాష్ట్రానికి అన్నిరకాలుగా నష్టం జరుగుతుందని, రాష్ట్రాభివృద్ధి కుంటుపడితే పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందని వివరించారు. కాబట్టి ప్రజలు ఆలోచించి వైసీపీని గద్దెదించి బీజేపీకి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రసాద్‌స్వామి, మనోహర్, పెద్దమఠం బాబు, రాజాజెట్టి పాల్గొన్నారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర

వి.కోట : ఆంధ్రాలో ఒక్కసారి, కేంద్రంలో మరోసారి అధికారం కట్టబెట్టాలని బీజేపీ పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా వి.కోటలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమశేఖర్ నేతృత్వంలో బీజేపీ నాయకులు ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు శ్రీకారం చుట్టారు. ప్రధాని నరేంద్రమోదీ అనేక రకాలుగా ఆంధ్రను ఆదుకున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు హేమంత్ కుమార్, బంగారురెడ్డి, నవీన్‌కుమార్ రాజు, వెంకటరమణ, నటరాజ్, రవికుమార్ ఉన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

రామకుప్పం, ఫిబ్రవరి 26: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ బూరుగుమాకులపల్లెలో తాగునీటి సరఫరా స్తంభించడంపై సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తమ గ్రామంలో రెండునెలలుగా తాగునీటి సరఫరా జరగక తాము అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఓ ప్రముఖ వ్యక్తి సృష్టించిన సమస్యతో తాగునీటి సరఫరా స్తంభించిదన్నారు. దీంతో తాము తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మంజునాత్‌ను వివరణ కోరగా గ్రామంలో రెండు నెలలుగా తాగునీటి సరవరా స్తంభించిందనడం అవాస్తవమన్నారు. పంపు ఆపరేటర్‌కు, గ్రామస్థుల మధ్య విభేదాలు పొడసూపడంతో కొన్ని రోజులుగా ఈ సమస్య తలెత్తిందన్నారు. మంగళవారం ఉదయం గ్రామానికి వెళ్ళి తాగునీటి సరఫరా పునరుద్ధరణ జరిగేలా చూస్తానని ఆయన తెలిపారు.



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఓంకారం ముందు పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కల్లూరు, ఫిబ్రవరి 26: టెన్త్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. సోమవారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో కొలువైయున్న జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా అమ్మవారు ఆశీస్సులు అందజేయాలని అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి వెలిగించి వీడ్కోలు సమావేశాన్ని ప్రారంభించారు. ఓంకారం ముందు జ్యోతి వెలిగించిన విద్యార్థులు ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శ్రీవాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. అనంతరం దాతలు వేణుగోపాల్, లలిత 174 మంది టెన్త్ విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను వితరణగా అందజేశారు. అర్చకులు అనంతకుమారాచార్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె బహిరంగసభలో సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరిగి వెళ్తున్న ప్రజలు, సీఎం వెళ్లే రోడ్డులో జనం వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు, సీఎం సభ ప్రాంగణంలో తాగి పడేసిన మద్యం

సీఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 26: సోమవారం కుప్పం నియోజకవర్గానికి వచ్చిన సీఎం జగన్‌కు రామకుప్పం మండలం రాజుపేట హెలిప్యాడ్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, జలవనరుల శాఖ పీఎస్ శశిభూషణ్‌కుమార్, కలెక్టరు షన్మోహన్, ఎస్పీ జాషువా, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం, జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, స్థానిక ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురంబాబు, కో-కన్వీనర్ చంద్రారెడ్డి తదితరులు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛాలిచ్చి ఘన స్వాగతం పలికారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో బహిరంగసభ ముగించుకుని తిరుపతి విమానాశ్రయానికి బయలుదేరిన సీఎం జగన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఎం వెంట ఆయన ప్రత్యేక కార్యదర్శి ధనుంజయరెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, ఎంపీ మిథున్‌రెడ్డిలు రేణిగుంటకు పయనమయ్యారు.

ఆక్రమణల తొలగింపు

కార్వేటినగరం, ఫిబ్రవరి 26: కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్రమణదారులు వేసుకున్న పూరి పాకలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం కళాశాల స్థలం కబ్జా అనే శీర్షికతో వచ్చిన కథనం మేరకు రెవెన్యూ యంత్రాంగం కదలింది. ఈ సందర్భంగా తహసీల్దారు పుష్పకుమారి కళాశాల స్థలంలో ఆక్రమణదారులతో మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన స్థలంలో అక్రమంగా నిర్మాణాలు, గుడిసెలు వేయరాదని చెప్పారు. కళాశాలకు సర్వేయర్ ద్వారా సరిహద్దులు నిర్ణయించామని, కళాశాల స్థలంలో కాంపౌండు గోడను నిర్మించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డికి చెప్పారు. ఇతరులు స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం, ఆక్షేపించిన వారిపై దౌర్జన్యానికి పూనుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది కళాశాల స్థలంలో అక్రమణదారులు వేసుకున్న తాత్కాలిక కొయ్యలను తీసివేశారు. తహసీల్దారుతో పాటు సర్వేయర్, కళాశాల సిబ్బంది ఉన్నారు

బస్సుల్లేక ప్రయాణికుల అగచాట్లు

పాలసముద్రం, ఫిబ్రవరి 26: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులను అధికారులు సోమవారం కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలంలో జరిగిన సీఎం జగన్ సమావేశానికి తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడ్డారు. అత్యవసరంగా చిత్తూరు, ఇతర పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో వెళ్లాల్సివచ్చింది. చిత్తూరు, పుత్తూరు పట్టణాల్లో చదివే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ఇళ్లవద్దే ఉండిపోయారు. ప్రైవేటు పాఠశాలల బస్సులు, వ్యాన్లలో సైతం సమావేశానికి జనాభాను తరలించడానికి ఉపయోగించుకోవడంతో ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే మూడు ఆర్టీసీ బస్సుల్లో రెండింటిని సమావేశానికి తరలించారు. దీంతో ప్రయాణికుల వద్ద ఆటోవాలాలు రెట్టింపు ఛార్జీలు వసూలుచేశారు.

29న కుంభాభిషేక సప్తమి వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 26: నగరంలోని బజారువీధి శివ సుందర వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేక సప్తమి వార్షికోత్సవం ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు పాలకమండలి చైర్మన్ వి. కణ్ణన్ తెలిపారు. 28న కలశాభిషేకం, 29న హోమాలు, అన్నదానం, మార్చి 1న స్వామివారికి పుష్పపల్లకి సేవలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

కార్వేటినగరం, ఫిబ్రవరి 26: కార్వేటినగరం లక్ష్మీనరసింహ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ గమ్యాలను సరైన దశలో నిర్ణయించుకోవాలని కళాశాల నిర్వాహకులు దిలీప్ కుమార్ కోరారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపకులైన ధర్మకర్త, ప్రవాసాంధ్రులు డాక్టర్ ఎ.కృష్ణమోహన్ ఉభయదారులుగా క్షీరాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా శివ, అన్నమయ్య సంకీర్తనలను భజన బృందం ఆలపించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాయలసీమలో రాజకీయంగా బలిజలకు అన్యాయం

● బలిజ సంఘం నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 26: అధికార, ప్రతిపక్ష పార్టీలు రాయలసీమ జిల్లాల్లో బలిజలకు అన్యాయం చేశాయని బలిజ సంఘం నేతలు ఆరోపించారు. సోమవారం చిత్తూరు బలిజ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రం నుంచి వందలాది మంది బలిజ కులస్థులు గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు ఓఎం రామదాసు మాట్లాడుతూ గత కొన్ని దఫాలుగా చిత్తూరు అసెంబ్లీ సీటును బలిజ కులస్థులకే ఇస్తూ వస్తున్నారని, ఇప్పుడు మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీలు బలిజలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. వైసీపీ, టీడీపీలోనూ బలిజ కులస్థులకు టికెట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు పునరాలోచించుకోవాలని, లేని పక్షంలో బలిజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. త్వరలో బలిజ కులస్థులు, పెద్దలతో చర్చించి బలిజ గర్జనను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు ఆరణి తులసీరామ్, పూల చందుకుమార్, రెడ్డిగుంట కిశోర్, రెడ్డప్ప, రవినాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య



నవీన్‌కుమార్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, ఫిబ్రవరి 26: రైలు కిందపడి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా వున్నాయి. హిందూపురం నియోజకవర్గంలోని పరిగి మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన శివశంకర్ రెడ్డి కుమారుడు నవీన్‌కుమార్ రెడ్డి (22) పూతలపట్టు మండలంలోని ముత్తిరేవుల వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతడు కళాశాల సమీపాన తన మిత్రులతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఏమైందో ఏమోగానీ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదివారం అర్ధరాత్రి ముత్తిరేవుల ఫ్లైఓవర్ సమీపాన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు చిత్తూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కేడర్ ఫిక్సేషన్‌లో అన్యాయం

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 26: ఉపాధిహామీ పథకం కింద గత 10 ఏళ్ళుగా వివిధ కేడర్‌లో పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని ఉపాధి హామీలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సోమవారం డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ ఎన్ఆర్ఈజీఎస్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ రిక్రూట్మెంట్ చట్టం డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం రాత, నైపుణ్య పరీక్షల ద్వారా తాము ఎంపికైనట్లు తెలిపారు. తమకు గ్రేడ్ ఫిక్స్ చేయడం, కేడర్ ఫిక్స్ చేయడంలో అన్యాయం జరుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించకుంటే జేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వారం తర్వాత సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. డీఆర్వోకు సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఆ సంఘం నాయకులు మురళీకృష్ణ, సునందిని, విశ్వనాథం, భువనేశ్వరీ, గౌతం, శ్రీనివాసులు, దేవేంద్ర పాల్గొన్నారు.

శయనోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పలమనేరు, ఫిబ్రవరి 26 : పలమనేరులోని కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఫిబ్రవరి 16వ తేది ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన స్వామి బ్రహ్మోత్సవాలు వారంరోజులుగా శివపార్వతులను పురవీధుల్లో వివిధ వాహనాలపై ఊరేగించారు. సోమవారం ఉదయం స్వామి వారికి, అమ్మవారికి యథావిధిగా ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం రాత్రి స్వామి వారి శయనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంటేవీరభద్ర, ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

కుప్పం రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనులు ప్రారంభం

కుప్పం, ఫిబ్రవరి 26: కుప్పంలో అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పూర్తి అయిన ఆధునీకరణ పనులను సోమవారం ఉదయం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. దేశంలోని 555 స్టేషన్లు ఈ పథకానికి ఎంపిక కాగా అందులో కుప్పం రైల్వేస్టేషన్ కూడా ఉంది. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులతోపాటు టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్. మునిరత్నం, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



సోమల, ఫిబ్రవరి 26: నంజంపేటలోని నిరుపేద కుటుంబాలకు మైనార్టీ యూత్ సభ్యులు 11రకాల నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. గత మూడేళ్లుగా ప్రతి నెలా 5కిలోల బియ్యం, నూనె ఒక లీటరు, గోధుమపిండి, మైదా పిండి, ధనియాల పొడి తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో అమ్ము, అక్బర్, సమీర్, అస్లాం, రిజ్వాన్, రఫీ, ఇర్ఫాన్, ఖాదర్ వలి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



సోమల, ఫిబ్రవరి 26: మండలంలోని సోమల, సూరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను దాత యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జీ.సీ.కే ప్రసాద్, అమృత వల్లీ దంపతులు సోమవారం అందజేశారు. వారి తల్లిదండ్రు జ్ఞాపకార్థం 10 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌తోపాటు విద్యార్థులకు బ్యాగులు, భోజన ప్లేట్లు ప్రతి ఏడాది అందజేస్తామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నిరంజన్ కుమార్, టి.నాగరాజ, ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, హరినాథ్, అరుణ, మస్తాన్, ఏవీ. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల-కలికిరి డబుల్ రోడ్డు పనులు పూర్తి



సోమల, ఫిబ్రవరి 26: ఎట్టకేలకు సోమల-కలికిరి డబుల్ రోడ్డు పనులు పూర్తి అయ్యాయి. సోమల నుంచి కలికిరికి 21 కిలోమీటర్లు సింగల్ రోడ్డు ఉండేది. గత 10 ఏళ్లుగా మరమ్మతులు లేక ప్రయాణం గగనంగా ఉండేది. ఈ నేపథ్యంలోనే సీఎంగా కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నప్పుడు రోడ్డు పనులు మంజూరై కలికిరి మండలం సరిహద్దు వరకు మాత్రమే డబుల్ రోడ్డు పనులు చేసి సోమల మండలం మిగిలిన పనులు ఆపేశారు. ఈక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి కలికిరి సరిహద్దు నుంచి సోమల వరకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు.

ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి26: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు ఉపవాసాలతో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక భోగనంజుండేశ్వరస్వామి, నెక్కొంది అగస్తీశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణల్లో స్వాముల దర్శనమివ్వగా భక్తులు పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు, రాము స్వామి, మంజునాథ్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి26: పుంగనూరులో కుక్క కాటుకు ముగ్గురు గాయపడిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. కొంతకాలంగా పట్టణంలో కుక్కల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానిక సూర్యనగర్‌లో ఓ పిచ్చికుక్క కుక్కలను కరుస్తుండగా అడ్డు వెళ్లిన శశిధర్‌తోపాటు మరో ఇద్దరిని, రెండు కుక్కలను కూడా కాటు వేసినట్లు స్థానికులు తెలిపారు. కుక్కల బెడద ఎక్కువగా ఉన్నట్లు ప్రతి నెలా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

టీడీపీ సీనియర్ నేతలను కలసిన 'గురజాల'


మాజీ మేయర్ కటారి హేమలతతో గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 26: చిత్తూరు నియోజవర్గ టీడీపీ అభ్యర్థి గురజాల గజన్మోహన్ పార్టీ సీనియర్ నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని గంగనపల్లెలోని మాజీ మేయర్ కటారి హేమలత నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అందరం కలసికట్టుగా పనిచేసి చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని ఆమె చెప్పారు. అలాగే తిరుచానూరులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్‌ను ఆయన నివాసంలో గురజాల జగన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ గెలుపునకు అందరం సమష్టిగా పనిచేద్దామని కోరారు. అదేవిధంగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, మాజీ కార్పొరేటర్ వసంతకుమార్‌లను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

గుడిపాల టీడీపీ నేతలతో ఆత్మీయ సమావేశం

గుడిపాల మండల టీడీపీ నేతలతో సోమవారం నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం కార్యాలయంలో గురజాల జగన్మోహన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యే టికెట్ కేటాయించారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి నేత, కార్యకర్త వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీకోసం పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన టీడీపీ నేతలు

గురజాల జగన్మోహన్‌కు టీడీపీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో సోమవారం నగరంలోని జీజేఎం కార్యాలయంలో టీడీపీ నేతలు ఆయనను కలసి సన్మానించారు. నియోజకవర్గంలో టీడీపీ విజయానికి అందరూ సమష్టిగా పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించుకుందామని చెప్పారు. జీజేఎంను కలసినవారిలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ చౌదరి, నేతలు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దారు

కార్వేటినగరం, ఫిబ్రవరి 26: కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్రమణదారులు వేసుకున్న పూరి పాకలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం కళాశాల స్థలం కబ్జా అనే శీర్షికతో వచ్చిన కథనం మేరకు రెవెన్యూ యంత్రాంగం కదలింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఈ సందర్భంగా తహసీల్దారు పుష్పకుమారి కళాశాల స్థలంలో ఆక్రమణదారులతో మాట్లాడుతూ కళాశాలకు సంబంధించిన స్థలంలో అక్రమంగా నిర్మాణాలు, గుడిసెలు వేయరాదని చెప్పారు. కళాశాలకు సర్వేయర్ ద్వారా సరిహద్దులు నిర్ణయించామని, కళాశాల స్థలంలో కాంపౌండు గోడను నిర్మించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డికి చెప్పారు. ఇతరులు స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం, ఆక్షేపించిన వారిపై దౌర్జన్యానికి పూనుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది కళాశాల స్థలంలో అక్రమణదారులు వేసుకున్న తాత్కాలిక కొయ్యలను తీసివేశారు. తహసీల్దారుతో పాటు సర్వేయర్, కళాశాల సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినుల ప్రతిభకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26: రాష్ట్రస్థాయిలో మూడవ ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైన కారణంగా వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలోని తొమ్మిదవ తరగతి విద్యార్థినులు పి. హిందూ, ఎన్.నవ్య ప్రతిభకు అభినందనలు తెలియజేశామని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ సోమవారం తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంటర్‌ప్రెన్యూ వియల్ఎక్స్ పో కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తెప్పించి వాటిలో ఉత్తమ, అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి పంపారని తెలిపారు. వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులు ప్రదర్శించిన వేస్ట్ వాటర్ బాటిల్స్ అండ్ బేవరేజెస్ బాటిల్స్ టు రెడ్యూస్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే ప్రాజెక్టు మూడవ ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైందని చెప్పారు. ఈ క్రమంలో విద్యార్థులను, గైడ్ టీచర్ జీవశాస్త్ర ఉపాధ్యాయులు దైవశిఖామణిని అభినందించినట్లు చెప్పారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 26: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్‌కే విద్యాలయ జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డీకే బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, డీఏఎస్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌కే జూనియర్ కళాశాలలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఈసీజీ, ఎకో, నేత్ర, గుండె వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. డిగ్రీ కళాశాలకు చెందిన 75 మంది విద్యార్థులు ఉచితంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైదేహి ఆసుపత్రి వైద్యులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల అగచాట్లు

పాలసముద్రం, ఫిబ్రవరి 26: చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులను అధికారులు సోమవారం కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలంలో జరిగిన సీఎం జగన్ సమావేశానికి తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడ్డారు. అత్యవసరంగా చిత్తూరు, ఇతర పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో వెళ్లాల్సివచ్చింది. చిత్తూరు, పుత్తూరు పట్టణాల్లో చదివే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా ఇళ్లవద్దే ఉండిపోయారు. ప్రైవేటు పాఠశాలల బస్సులు, వ్యాన్లలో సైతం సమావేశానికి జనాభాను తరలించడానికి ఉపయోగించుకోవడంతో ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. చిత్తూరు - బలిజకండ్రిగ మార్గంలో నడిచే మూడు ఆర్టీసీ బస్సుల్లో రెండింటిని సమావేశానికి తరలించారు. దీంతో ప్రయాణికుల వద్ద ఆటోవాలాలు రెట్టింపు చార్జీలు వసూలుచేశారు. ఆర్టీసీ బస్సులను వైసీపీ సమావేశాలకు తరలించడం పట్ల ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం చేశారు. ఆలయ వ్యవస్థాపకులైన ధర్మకర్త, ప్రవాసాంధ్రులు డాక్టర్ ఎ.కృష్ణమోహన్ ఉభయదారులుగా క్షీరాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తెలుగుయువత నేతపై దాడి


కన్నాను పరామర్శిస్తున్న కాజూరు బాలాజీ తదితరులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 26: తెలుగుయువత నేతపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేశారు. నగరంలోని కొండమిట్టకు చెందిన కన్నా సోమవారం నగరంలోని గాంధీ రోడ్డు బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరిమధ్య వాగ్వాదం జరిగి కొట్టుకున్నారు. అంతలో ఎదుటి వ్యక్తి ఫోన్ చేసి మరి కొంతమందిని రమ్మని పిలిపించి కన్నాపై మూకుమ్మడి దాడిచేశారు. స్థానికులు అడ్డుకుని కన్నాను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కన్నాను జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్, తెలుగుయువత నగర అధ్యక్షుడు యువరాజ్ తదితరులు పరామర్శించారు.

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య


నవీన్‌కుమార్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, ఫిబ్రవరి 26: రైలు కిందపడి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా వున్నాయి. హిందూపురం నియోజకవర్గంలోని పరిగి మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన శివశంకర్ రెడ్డి కుమారుడు నవీన్‌కుమార్ రెడ్డి (22) పూతలపట్టు మండలంలోని ముత్తిరేవుల వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతడు కళాశాల సమీపాన తన మిత్రులతో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఏమైందో ఏమోగానీ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదివారం అర్ధరాత్రి ముత్తిరేవుల ఫ్లైఓవర్ సమీపాన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు చిత్తూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

దాడి యత్నం పిరికిపంద చర్య


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు

గుడిపాల, ఫిబ్రవరి 26: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి ప్రయత్నించడం పిరికిపంద చర్య అని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడు అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ శాంతిపురంలో సీఎం జగన్ సభను చిత్రీకరించేందుకు వెళ్లిన ఫొటోగ్రాఫర్ శివకుమార్ కెమెరాను లాక్కొని, దాడికి ప్రయత్నించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని, పత్రికా స్వేచ్ఛను హరించాలని చూడటం దారుణమన్నారు. చిత్తూరు నగర కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, టీడీపీ నాయకులు గోవింద గౌడ్, బోడెబ్బ నాయుడు, బల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం


పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

కార్వేటినగరం, ఫిబ్రవరి 26: కార్వేటినగరం శ్రీలక్ష్మీ నరసింహ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ నిర్ణయాలు, గమ్యాలను సరైన దశలో నిర్ణయించుకోవాలని కళాశాల నిర్వాహకులు దిలీప్ కుమార్ కోరారు.

బాబు ష్యూరిటీ కరపత్రాల పంపిణీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26: రాబోయే ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి కోనేరు చెంగల్రాయరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని టీకేఎంపురం పంచాయతీలోని గ్రామాల్లో టీడీపీ శ్రేణులతో కలసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించి, బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డేటా అనాలసిస్ట్ మారేపల్లి మురళీ, సురేంద్రరెడ్డి, అశోక్, హేమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 26: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద వున్న అన్నక్యాంటీన్‌లో సోమవారం తూంపాయనపల్లి గ్రామానికి చెందిన లవకుమార్, సదకుప్పం గ్రామానికి చెందిన బాలకృష్ణలు చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ భోజనం వితరణ చేశారు. నాయకులు ఎన్‌పీ విక్రమ్, కమల్‌నాథ రెడ్డి, సుదర్శన్ నాయుడు, జనార్దన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, చంద్రయ్య నాయుడు, శ్రీనివాసులు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలోని అన్నక్యాంటీన్‌లో సోమవారం పేటఅగ్రహారం గ్రామానికి చెందిన పూర్ణ భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు యువరాజులు నాయుడు, కాంతారావు, గణపతి నాయుడు, సీకే చిట్టి, ఏకాంబరం, వీరభద్రయ్య, భాస్కర్, చిరంజీవి, సురేంద్ర, హిమకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 26: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ తెలిపారు. సోమవారం వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు సవ్యంగా కొనసాగాలన్నా ప్రధాని మోదీ ద్వారానే సాధ్యమన్నారు.

29న ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 26: నాగలాపురం ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో ఈ నెల 29వ తేదీన ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రవీంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 85 కిలోల బరువు కన్నా తక్కువ ఉన్నవారు పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.

విచ్చలవిడిగా నాటుసారా తయారీ, అమ్మకాలు

● పట్టించుకోని పోలీసులు

పాలసముద్రం, ఫిబ్రవరి 26: మండలంలో గత కొన్ని నెలలుగా నాటు సారా తయారీ, అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టాల్సిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ వ్యాపారం రోజురోజుకూ ఎక్కువవుతోంది. మండలంలోని నరసింహాపురం, తిరుమలరాజుపురం, గంగమాంబాపురం పంచాయతీల్లో నాటుసారా తయారీ, విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ గ్రామాలు తమిళనాడుకు సరిహద్దులో ఉండటంతో ఇక్కడ నాటుసారా తయారీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. 250 మి.లీ నాటుసారా ప్యాకెట్‌ను రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. బెల్లం ధరలు తక్కువగా ఉండటంతో నాటుసారా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు చందంగా వర్థిల్లుతోంది. 50 కిలోల బెల్లం ధర సుమారు రూ.2000 వరకు పలుకుతోంది. 50 కిలోల బెల్లంతో తయారీదారులకు 35 లీటర్ల నాటుసారా తయారవుతుంది. 35లీటర్ల సారా తయారుచేయడానికి సుమారు రూ.4వేల వరకు ఖర్చవుతుంది. 35 లీటర్ల నాటుసారాను టోకుగా అయితే రూ.10 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. సారా తయారీదారులకు మంచి లాభాలు వస్తుండటంతో ఈ ప్రాంతంలో గత మూడు నాలుగు నెలలుగా సారా తయారీ, విక్రయాలు ఎక్కువయ్యాయి. పోలీసులు అడపాదడపా సారా ఊటను ధ్వంసం చేసి కేసులు పెట్టినా తయారీదారులు మాత్రం వెరవడం లేదు. పోలీసులకు మామూళ్లు అందుతుండటం వల్ల వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ నాటుసారా తాగడానికి, కొనుగోలు చేసి తీసుకెళ్లడానికి తమిళనాడువాసులు ఎక్కువగా వస్తున్నారని, వారు సారా మత్తులో దొంగతనాలకు సైతం పాల్పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని సారాను అరికట్టాలని ప్రజలు కోరారు.

ముందే మలుపు... ఆపై రద్దీతో ఆటోలు


చిత్తపార మలుపు వద్ద అధిక లోడుతో వెళుతున్న ఆటో

గుడిపాల, ఫిబ్రవరి 26: మండలంలోని పలు ప్రాంతాల్లో మలుపులు అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు ఆటోల్లో ఓవర్‌లోడ్‌తో వృద్ధులు, విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని గుడిపాల క్రాస్, తుమ్మలవారిపల్లె, గుడిపాల అరుంధతివాడ, పాపసముద్రం, పిళ్లారికుప్పం, చిత్తపారకు వెళ్లే రహదారిలో ప్రమాదకరమైన మలుపులున్నాయి. ఈ రహదారిలో ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించుకుని వెళుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద స్పీడుబ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డైరీల ఆవిష్కరణ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 26: వెదురుకుప్పం డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జీసీటీఏ-2024 డైరీలను ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణశారద ఆవిష్కరించారు. కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ కె. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జీసీటీఏ నిరంతరం ముందుంటుందన్నారు. భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో కళాశాల బృందం పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుకే ఓటేయండి

- గాలి భానుప్రకాష్


మిట్టపాళెంలో భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నగరి, ఫిబ్రవరి 26: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం అభివృద్ధి పథంలో అడుగుపెట్టాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని మిట్టపాళెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మినీ మేనిఫెస్టోలోని ఆరు పథకాల గురించి వివరిస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. భానుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత నిరుద్యోగంతో బాధపడుతున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని రంగాల అభివృద్ధికి కృషిచేయడమే గాక భవిష్యత్తుకు భరోసా కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భానుప్రకాష్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నగరి మండల పరిధిలోని మేళపట్టులో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, నాయకులు టీఎన్‌టీయూసీ బాలాజీ, కరుణాకర్, నారాయణస్వామి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

క్రీడలతోనే మానసిక ఉల్లాసం పొందవచ్చని నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని మేళపట్టులో అంబేడ్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్ పోటీలను సోమవారం భానుప్రకాష్ ప్రారంభించారు. యువత కేరింతల మధ్య భానుప్రకాష్ బ్యాటింగ్ చేసి అలరించారు. అనంతరం అంబేడ్కర్ యూత్ క్లబ్ ఏర్పాటు చేసిన క్రికెట్ కిట్లను జట్టు సభ్యులకు ఆయన అందించారు.

టీడీపీకి పూర్వ వైభవం

విజయపురం: టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని క్షూరికాపురంలో టీడీపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రాజును పరామర్శించారు. అనంతరం మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు భానుప్రకాష్‌ను అభినందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్, నాయకులు శివలింగం, కపిల్, శరత్, గాలి మురళీ నాయుడు, శివయ్య నాయుడు, సుధా నాయుడు, మురళీ, దశరథరాజు, తులసి రామా నాయుడు, సుధాకర్ నాయుడు, మధు నాయుడు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండగానే ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 26: సమాజంలో ప్రతి మహిళ వివాహ వయస్సు 18 నుంచి 21 సంవత్సరాలని, 18 ఏళ్లు నిండగానే ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో యువతతో నిర్వహించిన నైబర్‌హుడ్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు, స్త్రీల ప్రాథమిక హక్కులు తదితర అంశాలపై విశ్లేషణాత్మక చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మాక్ పార్లమెంట్, ఓటు హక్కుపై అవగాహన, బేటీ బచావో - బేటీ పడావో తదితర కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతదేనని పేర్కొన్నారు. జిల్లా ఐసీడీఎస్ అధికారులు పాల్గొని స్త్రీ, బాలల హక్కులపై వివరించారు. జిల్లా బాలల పరిరక్షణాధికారి దాసరి సుబ్రమణ్యం బాలలు వెట్టి చాకిరిలో మగ్గిపోకుండా, వారిని విద్యావంతులుగా, సచ్ఛీలతగల పౌరులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను స్లైడ్‌షో ద్వారా వివరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ యువకేంద్ర కార్యకర్తలకు, విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు విలువ ఇవ్వండి: చలపతి


పాల్గొన్న రామానుజ చలపతి తదితరులు

నగరి, ఫిబ్రవరి 26: పార్టీ జెండాను మోసే టీడీపీ కార్యకర్తలకు విలువ ఇవ్వాలని నగరి పట్టణ పరిధిలోని సామాలమ్మ గుడి వద్ద రామానుజ చలపతి పేర్కొన్నారు. సోమవారం నగరి పట్టణ ఒకటో వార్డులో మహిళలతో రామానుజ చలపతి సమావేశం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ లత, అలిమేలు, రాధ, హేమ, అంజేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

41మందికి కంటి వైద్యపరీక్షలు

పాలసముద్రం, ఫిబ్రవరి 26: మండల కేంద్రమైన పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం చెన్నైకి చెందిన ఎం.ఎన్. కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. 41 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, 26 మందిని కంటి ఆపరేషన్ కోసం ఎంపికచేసినట్లు డాక్టర్ మోహన్‌కృష్ణ, డాక్టర్ అబ్దుల్ అబ్బాస్ పేర్కొన్నారు. ఆపరేషన్‌కు ఎంపికైన 26 మందిని చెన్నైకి తరలించారు. ఎం.ఎన్. కంటి ఆస్పత్రి యాజమాన్యమే వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, ఉచితంగా భోజన వసతి ఏర్పాటు చేసి, తిరిగి ఇక్కడకు తీసుకువస్తారని చెప్పారు. వారికి అవసరమైన కళ్లజోళ్లను సైతం ఆస్పత్రి యాజమాన్యమే ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు.

చెత్తను వేరుచేసే విధానాన్ని రద్దు చేయాలి

చిత్తూరు, ఫిబ్రవరి 26: పారిశుధ్య విభాగంలో పనిచేసే కార్మికుల చేత చెత్తను వేరుచేసే విధానాన్ని మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు నగరపాలక కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో చెత్తను వేరుచేయకపోయినా... చిత్తూరులో మాత్రం చెత్తను కింద కుమ్మరించి తడి, పొడి చెత్తను వేరుచేయాలని కార్మికులను వేధింపులకు గురిచేయడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు చెత్తను వేరుచేయడంపై అవగాహన కల్పించాల్సింది పోయి కార్మికులను చేయమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల చేత వేరుచేయించకూడదని గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినప్పటికీ నగరపాలక అధికారులు వేధించడం సరికాదన్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారుల ఆలోచన తీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు రమాదేవి, రఘు, గజేంద్రబాబు, దొరస్వామి, జయశంకర్, వరలక్ష్మీ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరు నగరపాలక కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

రాయలసీమలో రాజకీయంగా

బలిజలకు అన్యాయం



ర్యాలీగా వస్తున్న బలిజ సంఘం నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 26: అధికార, ప్రతిపక్ష పార్టీలు రాయలసీమ జిల్లాల్లో బలిజలకు అన్యాయం చేశాయని బలిజ సంఘం నేతలు ఆరోపించారు. సోమవారం చిత్తూరు బలిజ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రం నుంచి వందలాది మంది బలిజ కులస్థులు గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్షులు ఓఎం రామదాసు మాట్లాడుతూ గత కొన్ని దఫాలుగా చిత్తూరు అసెంబ్లీ సీటును బలిజ కులస్థులకే ఇస్తూ వస్తున్నారని, ఇప్పుడు మాత్రం అధికార, ప్రతిపక్ష పార్టీలు బలిజలకు అన్యాయం చేశాయని ఆరోపించారు. వైసీపీ, టీడీపీలోనూ బలిజ కులస్థులకు టికెట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు పునరాలోచించుకోవాలని, లేని పక్షంలో బలిజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. త్వరలో బలిజ కులస్థులు, పెద్దలతో చర్చించి బలిజ గర్జనను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు అరణి తులసీరామ్, పూల చందుకుమార్, రెడ్డిగుంట కిశోర్, రెడ్డప్ప, రవినాయుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వండి


మాట్లాడుతున్న కొత్తపల్లి మణి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 26: జీడీ నెల్లూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే టికెట్ తనకు ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తానని కొత్తపల్లి మణి అన్నారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో తాను ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నానని తెలిపారు. 25 సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్నానని పేర్కొన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనకు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్ జగన్ పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేశానని పేర్కొన్నారు. సీఎం జగన్ తన సేవలను గుర్తించి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు.

కేడర్ ఫిక్సేషన్‌లో అన్యాయం


డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 26: ఉపాధిహామీ పథకం కింద గత 10 ఏళ్లుగా వివిధ కేడర్‌లో పనిచేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని ఉపాధి హామీలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సోమవారం డీఆర్వో పుల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ ఎన్ఆర్ఈజీఎస్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ రిక్రూట్మెంట్ చట్టం డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ ప్రకారం రాత, నైపుణ్య పరీక్షల ద్వారా తాము ఎంపికైనట్లు తెలిపారు. తమకు గ్రేడ్ ఫిక్స్ చేయడం, కేడర్ ఫిక్స్ చేయడంలో అన్యాయం జరుగుతుందన్నారు. సమస్యను పరిష్కరించకుంటే జేఏసీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వారం తర్వాత సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. డీఆర్వోకు సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఆ సంఘం నాయకులు మురళీకృష్ణ, సునందని, విశ్వనాథం, భువనేశ్వరీ, గౌతం, శ్రీనివాసులు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

29న కుంభాభిషేక సప్తమి వార్షికోత్సవం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 26: నగరంలోని బజారువీధి శివ సుందర వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేక సప్తమి వార్షికోత్సవం ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు పాలకమండలి చైర్మన్ వి. కణ్ణన్ తెలిపారు.